క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాలు, కలర్ పెన్సిల్స్ బహూకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనే చిన్నారులకు ఉపయోగపడేలా పుస్తకాలు, కలర్ పెన్సిల్స్, క్రేయాన్స్ బహూకరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు చిన్నారుల కోసం ఆయా వస్తువులను అందజేశారు. శిక్షణ సమయంలో అందించేందుకు బిస్కెట్స్, చాక్లెట్స్ అందించారు. తరచూ గ్రంథాలయానికి వచ్చే తాము ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో చిన్నారులకు ఉపయోగపడేలా మెటీరియల్ అందజేసినట్లు విద్యార్థులు తెలియజేశారు. శ్రావణి, శృతి, చైతన్య బాలాజీ, శివకామేశ్వరి, అవినాష్, కళ్యాణి, అయ్యప్ప, భార్గవి చిరంజీవులు ఆద్య, సాత్విక, నైతిక్, సాయి సంయుక్త , సాయి అక్షర తదితరులు మెటీరియల్ బహూకరించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, కె.రమాదేవి, విద్యార్థులు, పాఠకులు, చిన్నారుల తల్లితండ్రులు, గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్ఓల సమ్మెతో రోగులకు ఇబ్బందులు



విజయవాడరూరల్: జాతీయ ఆరోగ్య మిషన్ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలో 23 కేంద్రాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సమ్మె చేస్తున్నారు. 23 శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, గత 8 నెలలుగా ఉన్న పెండింగ్ ఇన్సెంటివ్స్, హెల్త్ క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ విధులకు గైర్హాజరవడంతో గ్రామాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

ఆదిరాలకు బిరుదు ప్రదానం



విజయవాడకల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీ సంగీత విభావరి, సీనియర్ గాయకుడు, హిందూస్థానీ సంగీత విద్వాంసుడు ఆదిరాల జయప్రభు పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు ఆదిరాల జయప్రభు 35 సంవత్సరాల పాటు నగర పాలక సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారని తెలిపారు. తన సంస్థల ద్వారా అనేకమంది గాయనీ గాయకులను పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. సత్కార కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి, గాయని ఉమా బలరాం ఆంబేడ్కర్ సేవా సంస్థ సభ్యులు వెంకటపతి, వీరభద్రరావు, మారేపల్లి జోషి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు ఆదిరాల జయప్రభను లలిత కళాగాన కోకిల బిరుదుతో సత్కరించారు.

కష్టాల్లో ఉన్న వారికి చేయూత అందించాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడం వల్ల నిజమైన సంతోషం కలుగుతుందని వైఎన్నార్ చారిటీస్ ఛైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక 8వ డివిజన్ ఐటీఐ కళాశాల దగ్గర నివాసం ఉంటున్న విభిన్న ప్రతిభావంతుడు గుడివాడ రాజేష్ దంపతులకు జీవనోపాధి నిమిత్తం రూ.25 వేలు విలువ చేసే బడ్డీ కొట్టును యలమంచిలి జయప్రకాష్ గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుడైన రాజేష్ తన కుటుంబసభ్యులతో వచ్చి తనకు జీవనోపాధి కష్టంగా ఉందని తనను సంప్రదించాడని, వారికి జీవనోపాధి కోసం వైఎన్నార్ చారిటీస్ ద్వారా బడ్డీకొట్టును అందచేస్తున్నామని చెప్పారు. తమ దగ్గర ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా మేడే వేడుకలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే) వేడుకలు వాడవాడల్లో గురువారం ఘనంగా జరిగాయి. సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లోని హోచిమిన్ భవన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానిక కార్మికులు, ఆటోడ్రైవర్లకు మజ్జిగ పంపిణీ చేశారు. సీపీఐ నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, గురునాథం, గురవయ్య, బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

– ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో:

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలను సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో జరిపారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ పాల్గొని జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలను నేడు అధికారంలోకి వచ్చిన తరువాత తుంగలో తొక్కారని విమర్శించారు. మ్యానిఫెస్టోలు అంశాలను వదిలేసి తమ సొంత ఎజెండాను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో కార్మిక లోక ఆగ్రహాన్ని చవి చూడాల్సివస్తుందని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు జేపీ నాయుడు, వెంకటేష్, భాస్కర్, మీరా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో...

ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు మధురానగర్‌లో ఘనంగా జరిగాయి. డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్ క్లబ్, ఎక్స్‌రే వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మేడే సందర్భంగా లీలా గ్రాండ్ వద్ద కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్, నాయకులు గుర్రం ఏడుకొండలు, బోడి ఆంజనేయరాజు, సీహెచ్ సుబ్బయ్య, ఎక్స్‌రే వాకర్స్ క్లబ్ అధ్యక్ష/లు కొల్లూరి, గంటాడి సుజాత, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య నగర్లో మేడే దినోత్సవం

ఘనంగా మేడే వేడుకలు

పాయకాపురం(విజయవాడరూరల్): సుందరయ్య నగర్, ప్రకాష్‌నగర్, పరిసర ప్రాంతాల్లో గురువారం మేడే దినోత్సవాన్ని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 63వ డివిజన్ సుందరయ్యనగర్లో మేడే వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బొంగు రాంబాబు మాట్లాడుతూ ఎందరో కార్మిక నేతల త్యాగఫలితంగా కార్మికులు న్యాయమైన హక్కులను సాధించుకున్నారని తెలిపారు. కార్మికులందరూ సమైఖ్యంగా ఉండాలని కోరారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకర్స్ యూనియన్ నగర నాయకులు పి.సాంబిరెడ్డి, టి.ఎర్రన్న, ఎల్. నిర్మల, మునాఫ్, నాగిరెడ్డి స్థానికులు, కార్మికులు పాల్గొన్నారు. 61వ డివిజన్లోని ఆరు ప్రాంతాల్లో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమాలు జరిగాయి. ప్రకాష్‌నగర్, భాస్కరావు కొట్టు సెంటర్, పోలమ్మ తల్లి గుడి సెంటరు, దేవినేని గాంధీపురం, హెచ్‌బ్లాక్, పాయకాపురం ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, సెంటర్ సిటీ కార్యదర్శి భూపతి రమణరావు, నగర నాయకులు 61వ డివిజన్ ఇన్‌చార్జి చింతల శ్రీనివాస్, శాఖ కార్యదర్శులు సిహెచ్ అరుణ, జి.రాంబాబు, సిపిఎం నాయకులు వి.మహేష్, లీలాసాగర్, ఎం.శ్రీను, ఆర్.మల్లేశ్వరి, డి.నాగమ్మ, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడో అదనపు జిల్లా మెజిస్ట్రేట్ రైల్వే న్యాయస్థానం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెజిస్ట్రేట్ ఆర్.వి శర్మ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికుల పనులు, వారి చట్టాలు, రక్షణకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. శ్రమ దోపిడీ, బలవంతంగా ఎక్కువ సమయం పనులు చేయించుకోవడం నేరమని అందుకు పాల్పడిన యాజమన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వెలుసుబాటు ఉందన్నారు. దేశ ప్రగతిలో కార్మిక శక్తి ఎంతో ఉందని, అటువంటి కార్మికులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కార్మికులతో మాట్లాడి పని ప్రాంతంలో వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని వారికి పలు న్యాయ సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ పీపీ మురళీ, ఏపీపీ సిద్ధిఖీ, ఆర్పీఎఫ్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మెజిస్ట్రేట్ ఆర్వీ శర్మ



సింగ్‌నగర్‌లో ఆటో కార్మికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు



పైపులరోడ్డు వద్ద జెండా ఎగురవేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ చైతన్య సంక్షేమ సంఘం స్వాగతిస్తుందని సంఘం వ్యవస్థాపకురాలు వేముల బేబీ రాణి తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జన గణనతో పాటు కుల గణన జరగాలని 50 ఏళ్లుగా బీసీ సంఘాలు చేస్తున్న పోరాటాలు ఫలించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీలందరూ స్వాగతిస్తున్నారన్నారు. కులగణనతో బీసీల్లో అట్టడుగున ఉన్న 139 కులాల్లో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ పరంగా మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన ఫలాలు అందుతాయని, రాజ్యాధికారం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు తోలేటి శ్రీకాంత్, పెంటి శ్రీనివాస రావు, బట్టు లక్ష్మయ్య, చేవూరి రమేష్ , అప్పలబత్తుల శివశ్రీ, సోమాచారి ,పాండురంగ చారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అతి వేగంతో వచ్చిన బైక్ ఆటోడ్రైవర్‌ను ఢీ కొనడంతో గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన కొల్లిపర సుబ్రహ్మణ్యేశ్వరరావు(67) ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. బుధవారం ఉదయం అతను ఆటో కిరాయికి చిట్టినగర్‌కు వచ్చాడు. కేఎల్ రావు పార్కు వద్ద టిఫిన్ చేసేందుకు రోడ్డు దాటుతుండగా, చిట్టినగర్ నుంచి పాలప్రాజెక్టు వైపు వస్తున్న బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో సుబ్రహ్మణ్యేశ్వరరావు కుడికాలు విరిగింది. దీంతో బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విజయవాడ నగరంపై ఎందుకీ వివక్ష..?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 99 శాతం వెస్ట్ బైపాస్ పనులు పూర్తి
- సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):కూటమి సర్కార్ విజయవాడ నగరంపై వివక్ష చూపుతోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు విమర్శించారు. నగరం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోతుందని ఆరోపించారు. ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు ఏడాది గడుస్తున్నా.. నగరానికి కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేయటంలో అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో 99 శాతం పూర్తయిన వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావటంలో పూర్తిగా విఫలమైందన్నారు. చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి విజయవాడ నగరంలో నుంచి వెళుతుండటంతో దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. 2014- 19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపకపోగా.. గ్రాఫిక్స్ తో కాలయాపన చేసిందని విమర్శించారు. 2019 లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను గుర్తించి.. 99 శాతం పూర్తి చేసిందని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కీలకమైన తూర్పు బైపాస్‌ను అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కోసం కూటమి ప్రభుత్వం వదిలేసిందన్నారు. గత ఏడాది బుడమేరు వరదలతో విజయవాడ విలవిలలాడిందని విష్ణు గుర్తుచేశారు. బుడమేరును మొదటి దశలో రూ. 500 కోట్లతో అభివృద్ధి చేస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ఊదరగొట్టినా.. ఆచరణలో అమలుకు మాత్రం నోచుకోకపోవటమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం, కృష్ణమ్మ జలవిహార్ వంటి ప్రాజెక్టుల నిర్వహణను సైతం గాలికొదిలేసిందన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో...

విజయవాడ అభివృద్ధికి గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే కీలక అడుగులు పడ్డాయని మల్లాది విష్ణు అన్నారు. కనకదుర్గమ్మ ఫ్లైఓవర్, కీలక బెంజి సర్కిల్ మొదటి ఫ్లైఓవర్ కి సంబంధించిన మధ్యలో నిలిచిన పనులు పూర్తి చేసి.. రెండో ఫ్లైఓవర్ ను ప్రారంభించి, రికార్డు సమయంలో పనులు పూర్తి చేశామన్నారు. నది పరీవాహక ప్రాంతాల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్‌ను నిర్మించామన్నారు. విజయవాడను సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు గ్రీనరీ, కాలువ గట్లను అభివృద్ధి పరిచామన్నారు. విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఐదేళ్లలో ఫ్లైఓవర్ల నిర్మాణాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. కూటమి సర్కార్ మొద్దు నిద్ర వీడి నగర అభివృద్ధిపై దృష్టి సారించాలని.. వెస్ట్ బైపాస్ సహా పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

టెన్త్ విద్యార్థులకు నగదు పారితోషికం అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదువుతూ మంచి మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు నగదు పారితోషకం అందజేశారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ రావు విద్యార్థికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు ప్రోత్సాహక బహుమతిగా వితరణ చేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న లాయర్ కేజేఎస్ ప్రకాశరావు, రాజనీతి శాస్త్రం రిసెర్చ్ అసోసియేట్ డాక్టర్ పారా రమేష్‌లు స్కూల్ టాపర్లుగా నిలిచిన షేక్ ఆయుబ్, గుంటూరు అరవింద్, దారా సుప్రియ, చుక్క శరణ్యలకు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధన, దాతల సహకారంతో పట్టుదలతో కష్టపడి చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించి మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన నలుగురు విద్యార్థులు అభినందనీయులని కొనియాడారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పమే వారిని పాఠశాలలో ఉత్తమ విద్యార్థులుగా నిలబెట్టిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, రేయల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, మిరియాల నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూచిపూడి తరుణ్ బాబు నిర్వహించారు.



నగదు పారితోషకం అందజేస్తున్న ప్రకాశరావు, రమేష్

అవుట్‌ఫాల్ డ్రెయిన్లో ప్లాస్టిక్ వ్యర్థాలు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయిన్



పాయకాపురం ఇన్నర్ రింగ్‌రోడ్డు వద్ద కదలని మురుగు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగర పాలక సంస్థ క్షలక్షలాది రూపాయలను ఖర్చు చేసి అవుట్‌పాల్ డ్రెయిన్లు శుద్ధి చేసే పనులు చేపడుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వచ్చిన బుడమేరు వరదల్లో వ్యర్థాలతో పూడుకుపోయిన అవుట్‌ఫాల్ డ్రెయిన్లను శుభ్రం చేసే పనులకు గాను వీఎంసీ మంజూరు చేసిన రూ.17లక్షల పనులను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఇటీవల ప్రారంభించారు. పైపులరోడ్డు కు ఇరు వైపులా వున్న డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నట్లు కాంట్రాక్టర్ పొక్లెయిన్‌తో పనులు చేయించారు. అయితే 61వ డివిజన్ ప్రకాష్‌నగర్ వద్ద మాంసం దుకాణాల వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై వ్యాపారులు రాళ్లతో పూర్తిగా పూడ్చివేయడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు అంటున్నారు. అదే విధంగా యూనియన్ బ్యాంక్ వైపు కూడా అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో వ్యర్థాలు తొలగింపునకు నోచుకోలేదని చెబుతున్నారు. 61వ డివిజన్ పాయకాపురం, వాంబేకాలనీ నుంచి శ్మశానవాటిక వైపు వచ్చే అవుట్‌ఫాల్ డ్రెయిన్ వ్యర్థాలతో నిండి ఉంది. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు కుట్టి బొబ్బలు వస్తున్నాయని, రాత్రి సమయంలో నిద్రపోలేక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు అంటున్నారు. కండ్రిక జంక్షన్ నుంచి 33 తూముల వరకు వెళ్లే మురుగు కాల్వ నిర్మాణం పనులను వీఎంసీ ప్రారంభించలేదు. ఆ కాల్వకు ఆనుకొని ఉన్న వివిధ ప్రైవేటు కంపెనీల వారు కాల్వలోనే కొద్దిపాటి కల్వర్టులు నిర్మించుకున్నారు. ఆ కల్వర్టుల వద్ద తూటికాడ దట్టంగా పెరిగి మురుగు ముందుకు పారుదల కావడం లేదు. కండ్రిక వద్ద నాలుగు కోట్ల రూపాయలతో డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు పాలకులు ప్రకటించినా టెండర్లు ఇంకా పిలవలేదని సమాచారం. ఆ పనులు ప్రారంభిస్తే తప్ప 33 తూములు వైపు వెళ్లే మురుగు కాల్వ నిర్మాణం పనులు ప్రారంభం కావని అంటున్నారు. అవుట్‌పాల్ డ్రెయిన్లు శుద్ధి చేసే పనులపై అధికారుల పర్యవేక్షణ చేయాలని, అదే విధంగా డ్రెయినేజీ కాల్వల నిర్మాణం పనులు సత్వరమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నం

పాయకాపురం(విజయవాడరూరల్): కోర్టులో నడుస్తున్న కేసు వెనక్కి తీసుకోవాలని వేధింపులు భరించలేక మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నున్న గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వరరావు కుమార్తె సీతామహాలక్ష్మికి ఆగిరిపల్లి మండలం పోనసానిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య ఏర్పడిన వివాదాల కారణంగా పదేళ్ల నుంచి సీతామహాలక్ష్మి పుట్టింటి వద్దే ఉంటూ టైలరింగ్ చేస్తుంది. ఇంటి సమీపంలో ఉంటున్న తిరుపతి సురేష్ అనే వ్యక్తి ఆమెను వేధించడంతో కేసు పెట్టగా ఆ కేసు కోర్టులో నడుస్తోంది. ఆ కేసును వెనక్కి తీసుకోమని తిరుపతి సురేష్, జమలయ్య, సాయి, తస్నీర్ మల్లేష్, పాండు, యల్లయ్య అనే వ్యక్తులు వేధిస్తుండటంతో గత నెల 30వ తేదీన ఎలుకల మందు తాగింది. స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● జగ్గయ్యపేట: గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై శనివారం సాయంత్రం నాలుగు గంటలకు అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ సురేష్‌బాబు గురువారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో వేంచేసియున్న శ్రీభావనారాయణస్వామి, ఆంజనేయ, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, నాగేంద్ర స్వామి, విమానశిఖర, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ ఆలయాల పునప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాల నేపథ్యంలో భారీగా తరలివచ్చిన బంధుమిత్రులతో గ్రామంలోని ప్రతి ఇల్లు సందడిగా మారింది. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందినవారు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ఈ ప్రతిష్ఠా మహోత్సవాల్లో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



బొడ్రాయి వద్ద పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

విశ్వస్ఫూర్తి బోధనలు పాటించాలి

పెనుగంచిప్రోలు : శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి 85వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతివ్యక్తికి తన పుట్టినరోజు నుండే కొత్త సంవత్సరం మొదలవుతుందనే విషయాన్ని గ్రహించి, వారి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవితాన్ని సఫలం చేసుకోవాలన్న గురుదేవుల సూచనలను అందరూ పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిత్యం ప్రాణాయామం, యోగాసనాలు వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ గురుదేవులు రచించిన గ్రంథాలు, వాటి విశిష్టతను వివరించారు. చంద్రశేఖర్ గురుదేవులతో తమకున్న అనుబంధాలను నెమరవేసుకున్నారు.

కుల గణనపై పోరాటం ఫలించింది

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుల గణన ద్వారానే ఓబీసీలకు అన్ని విధాలుగా సామాజిక న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటం ఫలించిందని ఆ సంఘ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం దేశ వ్యాప్తంగా జనగణనతో పాటే కుల గణన జరుపుతామని ప్రకటించడంతో గురువారం సంబరాలు నిర్వహించారు. టిక్కిల్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో కేసన శంకరరావు, నరేంద్రమోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేకా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కులగణన కోరుతూ గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాటం చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ర్యాలీలు, నిరసనలు, అధికార, ప్రతిపక్ష నేతలకు వినతిపత్రాలు అందచేత వంటి అనే దశలుగా ఉద్యమం కొనసాగించినట్లు తెలిపారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో కేసన శంకరరావు చేసిన పోరాటం మరువలేనిదని, ఓబీసీ సమాజం ఎప్పుడు గుర్తుంచుకుంటుందన్నారు.

పోలీసుల వైఖరి దుర్మార్గం.....

ఏప్రిల్ 27న నగరంలో చేపట్టిన మహార్యాలీలో పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించి 70 ఏళ్ల వృద్ధుడు అని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్లు ఈడ్చుకుంటూ వెళ్లి విసిర పడేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీసీల పట్ల పోలీసులకు ఆ వైఖరి సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌యుఎస్‌ఎన్ మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, నగర అధ్యక్షుడు చప్పాడు చందు రమేష్‌కుమార్ ఇతర బీసీ నేతలు పాల్గొన్నారు.